చిన్నారులకు వరం.. బాలామృతం

- చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారణ
- వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల
- 7నెలల నుంచి 3ఏళ్లలోపు పిల్లలకు పంపిణీ



మానవపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం చిన్నారులకు వరంలా మారింది. ప్రతి చిన్నారీ శారీరకంగా, మానసికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాలామృతం పంపిణీకి శ్రీకారం చుట్టింది. 7నెలల నుంచి 3ఏళ్లలోపు చిన్నారులకు ఐసీడీఎస్ సిబ్బంది ప్రతినెలా బాలామృతం అందించడంతోపాటు వారి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించి వయస్సుకు అనుగుణంగా ఎదిగేందుకు తోడ్పాటునందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడంతోపాటు పోషకాలు కలిగిన ఆహారం అందిస్తుండడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి

మాతాశిశు ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు కార్యక్రమాలను చేపడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆహారం అందించడంతోపాటు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఐరన్, విటమిన్ మాత్రలు, టీకాల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు	గర్భిణులు	బాలింతలు
మానవపాడు	37	1937	235	125
ఉండవెల్లి	34	1683	252	129
అలంపూర్	41	2377	301	204
ఇటిక్యాల	60	3341	486	243
రాజోళి	37	2491	313	168
వడ్డేపల్లి	29	1699	249	86
అయిజ	81	3800	917	644

సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఆస్మా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మానవపాడు

సత్ఫలితాలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న బాలామృతంతో సత్ఫలితాలు వస్తున్నాయి. పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. చిన్నారులకు వీటిని తప్పకుండా అందించాలి. ఆయా మండలాల్లోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి చిన్నారికి బాలామృతం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సుజాత, ఐసీడీఎస్ సీడీపీవో, మానవపాడు

క్లుప్తంగా

శిథిలావస్థలో పశువైద్యశాల



శాంతినగర్: మండల కేంద్రంలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు మొత్తం పెచ్చులూడిపోయింది. చిన్నపాటి వర్షం కురిస్తే భవనంలోకి నీరు చేరి చిత్తడిగా మారుతోంది. ప్రస్తుతం ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాలకు నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

గుంతల పూడ్చివేత



కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాల స్టేజీ, కేటీదొడ్డి గ్రామాల మధ్యనున్న రాయిచూర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులను శుక్రవారం స్థానిక యువత పూడ్చివేశారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో తామే మట్టి పోసి గుంతలను పూడ్చివేసినట్లు ఈరన్న, వీరేష్, సవారెడ్డి తెలిపారు.

రైతుబీమా చేయించుకోవాలి



గట్టు: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రఘువంశీ కోరారు. శుక్రవారం బల్గెర రైతువేదికలో దరఖాస్తు చేసుకున్న రైతులకు బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబీమా నామినీ మార్పు, తప్పుల సవరణ, కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నామినీ ఆధార్ జిరాక్స్‌తో రైతువేదికలో సంప్రదించాలని సూచించారు.

ఇంటింటి సర్వే



అలంపూర్: మున్సిపాలిటీలో 2009లో ఇళ్లు కోల్పోయిన బాధితులు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి దరఖాస్తుదారుల వివరాలను సేకరించారు. వరదలతో సర్వం కోల్పోయిన తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని దాదాపు 690 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ఇంటి స్థలాలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

భారతి సిమెంట్‌తో నాణ్యమైన నిర్మాణం



గద్వాల న్యూటౌన్: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పెట్టింది పేరని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ కొత్త సునీల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరంగస్వామి ట్రేడర్స్ ఆధ్వర్యంలో మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ సాంకేతిక ప్రమాణాలను వివరించారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం అవుతుందని చెప్పారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో సంస్థకు చెందిన నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి వినియోగదారులు, మేస్త్రీలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. యాదాద్రి, ఆలేరు–వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణాలకు భారతి సిమెంట్ వాడడం గర్వకారణమన్నారు. అనంతరం 70మంది మేస్త్రీలకు ఉచితంగా రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి విజయ్‌బాబు, టెక్నికల్ ఆఫీసర్ నితీస్, డీలర్ రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

అయిజ: మండలంలోని కిష్టాపురం మీదుగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుంకన్న మాట్లాడుతూ రాత్రింబవళ్లు టిప్పర్ల రాకపోకలతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మల్దకల్: ఆరోగ్య సంరక్షణకు గర్భిణులు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, శ్రీధర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి ఏడాది జైలుశిక్ష

గద్వాల క్రైం: అకారణంగా దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడికి సంవత్సరం జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్‌జడ్జి ఉదయ్‌నాయక్ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెచల్ సంజన జాషువా తెలిపారు. గట్టు మండలంలోని ఆలూరుకు చెందిన నెమలి చిన్నరంగన్న అదే గ్రామానికి చెందిన కుమ్మరి పద్మపై అకారణంగా కర్రతో దాడికి పాల్పడినట్లు 2018లో గట్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని పేర్కొన్నారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నిందితుడికి సంవత్సరంపాటు జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పీపీ తెలిపారు.

శుభ్రత అందరి బాధ్యత



మానవపాడు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ రిజ్వాన తాన్విర్ అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం పరిసరాల శుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కేజీబీవీలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనం, సురక్షితమైన నీరు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అనురాధ, సత్యనారాయణ, చంద్రన్న పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను తొలగించారు. వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి



బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గట్టు: ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ మహ్మద్ జుబేర్ మొహినుద్దీన్ బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని ఆలూరులో శుక్రవారం బీఎల్‌ఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. చనిపోయిన ఓటర్లను కుటుంబ సభ్యుల అనుమతితో జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సుభాష్‌నాయుడు, విజయకుమార్ సూపర్‌వైజర్లు కరీం, శ్రీనివాసులు, తిరుమలేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి



యాపదిన్నె శివారులో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ పోలీసులు



జూలెకల్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఎంపీడీఓ రవీంద్ర కోరారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వడ్డేపల్లి మండలం రామాపురం,, జూలెకల్ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికిగానూ వడ్డేపల్లి మండలంలో 42,400 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున పెద్దఎత్తున మొక్కలు నాటలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతన్న, ఏపీఓ విజయలలిత, టీఏ రాఘవేందర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజ్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామశివారులో ఎక్సైజ్ పోలీసులు కర్జూరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌ఐ రాజేందర్ మాట్లాడుతూ మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేసి రోజూ నీరందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వేణు, మహేష్, చందు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇసాక్, మైనార్టీసెల్ నాయకులు కిపాయిత్, కౌసర్ బేగ్ మాట్లాడుతూ ముస్లింలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మంత్రి హరీశ్‌రావు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ముస్లింలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే సహించమన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం ముస్లింలకు రూ.లక్ష సాయానికి తెరలేపిందని విమర్శించారు. కార్యక్రమంలో పాషా, జహంగీర్, ఇలియాస్, జమాల్, మహబూబ్, ఖాజా, రంజిత్ పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె



అలంపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అలంపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె శుక్రవారం కొనసాగింది. వర్షంలోనూ కార్మికులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె శిబిరానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. లాలన్న, మద్దిలేటి, అఖిల్ ఎల్లన్న పాల్గొన్నారు.

మల్దకల్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. రామన్న, గోపాల్, సత్యం, కిష్టన్న, రామకృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అమానుషం



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: మణిపూర్ ఘటన అమానుషమని, ఇందుకు ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత వహించి రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ అల్లర్లకు కేంద్రమే కారణమని ఆరోపించారు. రెండు జాతుల మధ్య వైషమ్యాల వల్ల మహిళలను క్రూరంగా హింసించి బహిరంగంగా చంపడం దారుణమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న, సత్యరాజు, ప్రవీణ్, హన్మేష్ ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

మణిపూర్‌లో మహిళలను అర్ధనగ్నంగా ఊరేగించి హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా, కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టి ఓటుబ్యాంక్ రాజకీయాలు చేస్తుందన్నారు. మణిపూర్ ఘటనను ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఉదయ్‌కిరణ్, వెంకటస్వామి, ఆంజనేయులు, మధుసూదన్‌బాబు, అతిఖూర్ రహ్మాన్, రవి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

దేశంలో మహిళలకు రక్షణ కరువైందని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ప్రతినిధి పరుశరాముడు ప్రకటనలో పేర్కొన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.



గట్టులో నిరసన తెలుపుతున్న మహిళలు

నిందితులను ఉరి తీయాలి

ఉండవెల్లి: మణిపూర్ నిందితులను ఉరి తీయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శేఖర్, మహబూబ్ బాషా, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

గట్టు: మణిపూర్ ఘటనను ఖండిస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల హత్యలు, లైంగికదాడులు, వేధింపులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. మణిపూర్ నిందితుల ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిములమ్మ, లక్ష్మి, జయమ్మ, శాంతమ్మ, పద్మ, రాములమ్మ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

గట్టు: కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గట్టు–2 ఎంపీటీసీ కృష్ణ శుక్రవారం అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని గంగిమాన్‌దొడ్డి, సల్కాపురం, చమన్‌ఖాన్‌దొడ్డి, కొత్తపల్లి, ముచ్చోనిపల్లె గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గంగిమాన్‌దొడ్డి, సల్కాపురం గ్రామస్తులు మండల కేంద్రంలో, చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు ఇందువాసి, కొత్తపల్లి గ్రామస్తులు చాగదోన, ముచ్చోనిపల్లె గ్రామస్తులు తుమ్మలపల్లిలో ఓటుహక్కు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో 350 నుంచి 650 మంది దాకా ఓటర్లు ఉన్నారని, ఇతర గ్రామాలకు వెళ్లి ఓటు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ.. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పరిశీలనకు స్థానిక తహసీల్దార్‌కు రెఫర్ చేసినట్లు ఎంపీటీసీ కృష్ణ తెలిపారు.

బాలలను పనుల్లో పెట్టుకోవద్దు

శాంతినగర్: బాలలను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హన్మిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్‌లో శుక్రవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్లస్టర్ లెవల్ మహిళా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, కౌన్సిలర్ ధనలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

శాంతినగర్: ఉపాధి హామీ పథకం, ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ఎంపీడీఓ రవీంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మామిడి, నిమ్మ, నారింజ, జీడి మామిడి, జామ, సీతాఫలం, సపోట, ఆయిల్‌పాం, నేరేడు, ఆపిల్ బేర్, దానిమ్మ, మునగ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. ఆసక్తిగల రైతులు పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓ, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మండల వ్యవసాయాధికారి, ఎంపీడీఓ, ఎంపీఓలను సంప్రదించాలని సూచించారు. అర్హులైన రైతులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

గట్టు: ధరూరు మండలం కోతలగిద్దకు చెందిన విద్యార్థిని మహేశ్వరి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభకనబర్చి ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించింది. విద్యార్థిని చదువు నిమిత్తం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడు శుక్రవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

అవగాహన

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలకు ఓటరు నమోదుపై తహసీల్దార్ వీరభద్రప్ప, డీటీలు ధరణిషా, వేణుగోపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఫారం–6, 7, 8లను నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు తప్పుల సవరణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుచిత్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



అలంపూర్ రూరల్: పట్టణంలోని బాలికల, ఎస్సీ బాలుర వసతిగృహాల్లో శుక్రవారం క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బరువును పరిశీలించి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వసతిగృహాల పరిసరాలు, తాగునీరు, వంటగదిని పరిశీలించారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుజాత, హెచ్‌ఎస్ అక్కమ్మ, ఏఎన్‌ఎంలు శ్యామలాదేవి, సురేఖ, ఆశ కార్యకర్తలు భారతి, జయమ్మ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా



అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడు మార్గమధ్యంలో ఉన్న వాగుపై శిథిల కల్వర్టును తొలగించి నూతనంగా నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు మాట్లాడుతూ కల్వర్టు శిథిలం కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కల్వర్టుపై వరద ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలు నిలిచిపోతాయన్నారు. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

సహాయక చర్యలకు సిద్ధం

శాంతినగర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు వడ్డేపల్లి మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ నిత్యానంద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సహాయక చర్యలు చేపట్టేందుకుగానూ విభాగాల వారీగా సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. వర్షాలు తగ్గి సాధారణ స్థితి వచ్చే వరకు ఎవరికి కేటాయించిన విధుల్లో వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధినిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పుల ఊబిలో రైతులు



గట్టు: సీడ్ ఆర్గనైజర్ల దోపిడీతో పత్తి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆలూరు, రాయాపురం, సల్కాపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి సీడ్ పత్తి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పులు చేసి రైతులు సీడ్ పత్తి పండిస్తే వడ్డీకే సరిపోతుందని తెలిపారు. రైతులు అప్పులను తీర్చలేకపోతుండడంతో ఆర్గనైజర్లు పొలాలను లాక్కుంటున్నారని ఆరోపించారు. ఎర్ర తెగులతో రైతులు నష్టపోతుండగా, ఇటు కంపెనీలు, అటు ఆర్గనైజర్లు స్పందించకపోవడం దారుణమన్నారు. సీడ్ పత్తితో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, ప్రేమ్‌రాజ్, లక్ష్మన్న, పరుశరాముడు, వెంకట్రాములు, గోపాల్, కిష్టన్న, ఆశన్న, జమ్మన్న, గోవిందు, భూపతినాయుడు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన రాకేష్ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. రెండునెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటి వరకు రాలేదని, అతడి కోసం కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. యువకుడి తండ్రి చిన్న బీసన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.